# పితృవాత్సల్యం

రచన: రాళ్ళభండి నరసింహమూర్తి

ఆనాటి యెండ తుకతుకలాడించేసి సాయంత్రము కాగానే ఇంటిలోనుంచి బయటకు గెంటేసింది. ప్రతివాడూ తన తీక్ష్ణతనుగురించే తిడుతున్నారని గామాల్సు చిన్న బుచ్చుకొని లోకానికి మరుగుపడుతున్నాడు, ఎర్రమొహంతో సూర్యుడు.

'ఎక్కడా గతిలేకపోతే నా దగ్గరకురా' అంటూ అనాథ శరణాలయంలాగ పార్కు ఆహ్వానాన్ని అందుకుని లోపలికి వెళ్ళాను.

మెత్తటిగడ్డి బీడుమీద శేషశాయి పోజులో పడుక్కుని ప్రక్కన పిల్లాడితో కేరింతాలు కొడుతున్నాడు సాంబు. వాడ్ని కలుసుకుని చాలాకాలమయింది. ఉభయ కుశలోపరి — అన్నా; 'ఏంరా బాంబూ! (చనువుగా అలాగా పిలుస్తాము-అయినా వాడు బాంబులాగే వుంటాడు.) ఈబుడ్త డెవడ్రా' అని.

'నీకు తెలియదూ! మా అబ్బాయిరా' అని వూర్కోక 'మరి నీవేమన్నా...' అంటూ అర్థోక్తిలో వదిలేశాడు.

సమాధానంగా పెదిమ విరిచాను.

'ఓరి దద్దమ్మా' అని మాత్రము అభినందించాడు.

ఏదోవిధంగా టాపిక్ మారుద్దామని 'ఒరే! వీడి కెన్నేళ్ళురా' అన్నాను.

'ఆ! ఇంకా ఏళ్ళెక్కడా? మొన్ననే ఏడాది వెళ్ళింది.'

'మాంఛి భారీగానే వున్నాడే! ఏం తినిపిస్తున్నావు?' అన్నాను కుర్రాడి బుగ్గమీటుతూ.

'అబ్బ అలాగ అనబోకురా' అన్నాడు అదో ఈర్ష్యగా పిల్లాడిని ఒళ్ళోకి ఒత్తుకుంటూ.

నిజమే ఆమాట వాడ్ని నొప్పిస్తుందని పిల్లలు లేనివాడ్ని నాకెలా తెలుస్తుంది?

'మాటలు వచ్చా.'

'ఇంకా నిదానంగా అడుగుతావేం! వాడి మాటలు చెప్తావు! అబ్బా కోటలు దాటిపోతుంటే...ఒకటా రెండా...మ రిదిగో మొన్న నేమయిందనుకున్నావు...'

మధ్యలో ఆపి 'సరేగాని పేరేం పెట్టా' వన్నాను. నేనలా వాడి మాటకి అడ్డుతగిలినందుకు కొంచెం ముఖము చిట్లించుకుని...... మళ్లీ కాస్త తేరుకుని వాడిపేరా...వాడిపేరు- అన్నట్లు నేను చెప్పట మెందుకూ? వాడే చెప్తాడు' అని యిక పిల్లాడివంక తిరిగాడు. వాడు సావకాశంగా గడ్డిపురుగుని పట్టుకు చంపుతున్నాడు. దాన్ని విదిలించి 'ఒరే నాన్నా! మరేబాబాయి నీ పేరు చెప్పమంటున్నాడు చెప్పమ్మా.'

నోటిలోవేలు కొరుక్కుంటూ కారే చొంగతో చొక్కా తడుపుకుంటూ అదో పోజులో మొహాముపెట్టి అడ్డంగా తలతిప్పాడు.

'చెప్పమ్మా చెప్పు! అదేమరి - నీకు పిప్పరమెంట్లు అక్కర్లేదే?'

'ఊఁ! నాకేంవద్దు.'

మళ్ళీ ఇంకొకసారి అడిగాడు ససేమిరా అన్నట్లు వాడు తల అడ్డంగాతిప్పాడు. కొంచెం డిజప్పాయింటయి 'నిన్ను చూసి సిగ్గుపడుతున్నాడ్రా' అని నామీద నెపంతోసి మళ్ళీ అడగటము ప్రారంభించాడు—మారాం చేసే మోటారుకు స్టార్టు చెయ్యటానికి ఓపికతో హేండిలు కొట్టేవాడిలాగ, వాడి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరకు వాడు 'కాని యిత్తే చెప్తా!' అన్నాడు. గబగబా సాంబుజేబు తడుముకుని నామొహంవంక తెల్లబోయి చూశాడు. నేనూ గ్రహించుకుని వాడి చేతులో కానీకాసు పెట్టాను.

'ఊహుఁ ఇది కొత్తదికాదు! ఎదవ పాతది' అంటూ అవతల పారేశాడు. ఇలాగా యెన్నో ప్రయత్నించాడు. వాడికీ ఓర్పు తగ్గింది లాలనంతా పోయి 'చెప్తావా చెప్పవా వెధవా' అంటూ కసిరాడు.

'నేనేం తెప్పను ఫో!' అన్నాడు కుర్రాడు.

మళ్లీ ద్విగుణీకృతంగా గదమాయిస్తూ చెయి గూడా పైకి ఎత్తాడు. వాడేం తక్కువవాడా! తండ్రంత పెంకివెధవ, చెప్పలేదు.

అనుకున్నంతా అయింది. వీపుమీద ఫెడీలుమని చరిచాడు కుర్ర వెధవని. వాడమాయికంగా బావురుమన్నాడు, మా వాడి మొరటుతనానికి నాకు అసహ్యమేసింది. వాళ్లకంచూస్తే ఎక్కడా మాట్లాడించేటట్లు లేగు, సరే! అగతాన్ని యెదురుచూస్తూ నా నాలుకకు గడ్డికుచి చూపిస్తున్నాను.

పిల్లాడు ఏడుపులోనే 'బండనాన్న' అని తిట్టాడు. దాంతో సాంబు మరింత రెచ్చి 'చెప్పరా నీపేరు గాడిదె' అంటూ మరొకటి తగిలించాడు.

వాడు మొహమంతా కంది గొల్లున ఏడుస్తుంటె నాకు చాలా కష్టమేసింది. వెధవ పేరు చెప్పటానికి ఇంత రసాభాసం చెయ్యాలా! ఏదో ముద్దుకోసం పోయి మొద్దుపన్నులోకి దిగటం చాలా ఘటుత్వంగా తోచింది—నాకైనా పిల్లలు లేకపోతే మానేగాని.

చివరకు ఇక నెగ్గదనుకున్నాడో ఏమో ఆ ఏడుపులోనే 'చీ...తా...లా...ము...డు—' అంటూ ఓ దీర్ఘం తీసి మరింత బావురుమన్నాడు.

ఇక పేరు చెప్పగానే మాసాంబుగాడికి ఏవో సామ్రాజ్యాల్ని గెలిచినంతగా...ఒక్కసారి అగ్నిపర్వతము బ్రద్దలయినట్లుగా నవ్వి—మరి ఆ కోపమంతా యెక్కడికి మాయమయిందో—

'మా పిచ్చినాన్నే! నేను చచ్చిపోయినంత! ముందే చెప్పితే పోయేదిగా అమ్మా!' అంటూ వాటికి నీతులు కరుపుతూ ఆ చీమిడిముక్కునే ముద్దెట్టుకుంటూ ఒళ్ళోకి తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు.

నా పాడుబుర్రకు వాడన్నది అర్థంకాక మళ్లీ ఎంతరభస కావాలో అనే భయంతోనే 'ఇంతకూ వాడిపేరేమిటిరా?' అన్నా.

దాంతో వాడు ఆకాశములోంచి పాతాళంలోకి పడ్డవాడిలాగ చూస్తూ "వాడన్నది అర్థం చేసుకోలేదట్రా. అప్పుడే నీబోటి గొడ్డాయి (ఫుద్రేకముతో) గాళ్ళకు పిల్లల ముద్దుమాటల్లోని జిగి ఏం అర్థమాతుందీ, అన్నాడు నా అనపత్యతను వెలితిపరుస్తూ.

నేను మానాభిమానాలు కాశీలో వదిలిన వాడ్ని; అవేం ఖాతరు చెయ్యక 'నన్ను చంపక-చెప్పదూ పోతాను' అన్నాను విసుగ్గా.

'సీతారాముడురా!' అన్నాడు సాంబు. అస్తే ఈ కాస్త దానికి ఇంతగందరగోళం చెయ్యాలా అనుకుని వాడ్ని వదిలించుకుని బయటపడ్డాను.

రాను రాను

